సాక్షి కామారెడ్డి

బుధవారం । 26 । జూలై । 2023



అభివృద్ధికి మారుపేరు..

తెలంగాణను ప్రగతి పథంలో నడిపిస్తూ సీఎం కేసీఆర్ అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తున్నారని గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- 8లో ▸



నాలుగు నెలల్లో..

రాష్ట్రంలో నాలుగు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.3 /21.7

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

1న జావెలిన్ త్రో, అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో వచ్చేనెల ఒకటో తేదీన జిల్లా స్థాయి జావెలిన్‌త్రో, అథ్లెటిక్స్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ విషయాన్ని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 కేటగిరీలలో జావెలిన్ త్రోతోపాటు 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పోటీలలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వయసు ధ్రువీకరణ పత్రం లేదా బోనఫైడ్ సర్టిఫికెట్లతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లాలో 'నిధి ఆప్కే నికట్'

నిజామాబాద్ సిటీ : ఉమ్మడి జిల్లాలో ఈనెల 27న నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ సహాయక కమిషనర్ మధుసూదనాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా లో రుద్రూర్ మండలం కృషి విజ్ఞాన కేంద్రం అధికారి సీహెచ్‌వీ శ్రావణ్‌కుమార్, కామారెడ్డి జిల్లా పాత రాజంపేట నర్సన్నపల్లిలో అధికారి ఎస్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ కార్యక్రమం ఉంటుందన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

'ఇన్‌స్పైర్' సమావేశంలో పాల్గొనాలి

కామారెడ్డి టౌన్: ఇన్‌స్పైర్ నామినేషన్లపై విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.45 గంటలకు జూమ్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఇన్‌స్పైర్ ఇన్‌చార్జీ ఉపాధ్యాయులు తప్పకుండా పాల్గొనాలని జిల్లా సైన్స్ అధికారి ఎం.సిద్దిరాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి తప్పకుండా ఐదు నామినేషన్లను నమోదు చేయాలని, ఇతర వివరాలకు 94404 14250 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఓయూ దూరవిద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్

కామారెడ్డి అర్బన్: ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్య విధానంలో పీజీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమిస్టర్ విధానంలో కోర్సులున్నాయని, ఇతర పనులు చేసుకుంటూ ఉన్నత విద్య అభ్యసించడానికి ఇది అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశాలు, వివరాలకు సంబంధించి కళాశాల ఆంగ్ల విభాగంలోగాని, ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 94403 56276, 91823 04067 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వం విద్యాసంస్థలకు మరోసారి సెలవులు ప్రకటించింది. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున బుధ, గురువారాల్లో విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలన్న నిర్ణయం తీసుకుంది. వర్షాల కారణంగా ఈనెలలో ఇప్పటికే 20, 21, 22 తేదీలలో సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందే.

'పీఆర్సీ కమిటీ పేరుతో కాలయాపన చేయొద్దు'



బాన్సువాడ: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్సీని కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా మధ్యంతర భృతిని ప్రకటించి సంతృప్తికరమైన పీఆర్సీ అందించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడలో తహసీల్దార్ గంగాధర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ ప్రతినిధులు నరసింహచారి, దర్శనం శంకర్, రాజు, సాయిలు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 6,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు పోచారం ప్రాజెక్టు వరద నీటితో పొర్లుతుండడంతో మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 6,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. మంగళవారం సాయంత్రానికి 1,400.6 అడుగుల(11.96 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

సింగితంలోకి 2 వేల క్యూసెక్కులు..

బాన్సువాడ, వర్ని మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి 2 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.5 మీటర్లతో నిండుకుండలా ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు అలుగు పైనుంచి పొంగి పొర్లుతోంది.

పొర్లుతున్న నల్లవాగు మత్తడి

సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్, కంగ్టి, నారాయణఖేడ్, నిజాంపేట, సిర్గాపూర్ మండలాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని నల్లవాగు మత్తడిలోకి వరద నీరు ఉధృతంగా వస్తోంది. మత్తడి అలుగుపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతోంది.



అలుగు పారుతున్న సింగితం రిజర్వాయర్

జిల్లాలో మంగళవారం నమోదైన వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)	మండలం	వర్షపాతం
		మాచారెడ్డి	48.4
		పాల్వంచ	46.4
బాన్సువాడ	80.8	భిక్కనూరు	45.8
గాంధారి	72.9	ఎల్లారెడ్డి	43.2
తాడ్వాయి	62.6	బీబీపేట	41.3
సదాశివనగర్	60.0	బిచ్కుంద	39.6
నస్రుల్లాబాద్	54.5	రామారెడ్డి	39.3
నిజాంసాగర్	54.3	దోమకొండ	37.3
లింగంపేట	54.1	పిట్లం	34.9
కామారెడ్డి	53.0	మద్నూర్	29.8
నాగిరెడ్డిపేట	51.6	జుక్కల్	26.3
రాజంపేట	50.0	డోంగ్లీ	20.8

మళ్లీ వరుణుడి జోరు

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో మూడు రోజులపాటు గెరువిచ్చిన వరుణుడు మరోసారి తన ప్రతాపం చూపాడు. సోమవారం రాత్రి మొదలైన వర్షం మంగళవారం కూడా కొనసాగింది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సరాసరిన 46.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బాన్సువాడలో 80.8 మి.మీటర్ల వర్షం కురిసింది. దాదాపు జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. భారీ వర్షాలతో వగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పోచారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగింది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. భారీ వర్షాలకు పలుచోట్ల ఇళ్లు కూలిపోయాయి. కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో అంగన్‌వాడీ భవనం పెచ్చులూడిపడ్డాయి. లింగంపేట మండలం మోతె గ్రామంలో రేకుల షెడ్డు కూలిపోవడంతో ఆ ఇంట్లో ఉంటున్న బాలుడికి గాయాలయ్యాయి. వరదలతో పలు ప్రాంతాలలో పంటలు నీటమునిగాయి. పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ చౌరస్తా నుంచి బేగంపూర్ గ్రామనికి వెళ్లే జాతీయ రహదారిపై నీరు ప్రవహించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వరినాట్లు ముమ్మరం అయ్యాయి. వర్షం కురుస్తున్నా సరే రైతులు నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.

కల్యాణి ప్రాజెక్టు 4 గేట్ల ఎత్తివేత



ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టులోకి మంగళవారం వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఏఈ శివప్రసాద్ మంగళవారం తెలిపారు. దీంతో ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి 900 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. వంద క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లించామన్నారు.



బాన్సువాడ రూరల్: కోనాపూర్ శివారులో నీటమునిగిన పంట

'పోచారం'లోకి 11 వేల క్యూసెక్కులు..

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టుకు మంగళవారం వరద ఉధృతి భారీగా పెరిగింది. ప్రాజెక్టు ఎగువప్రాంతం నుంచి సోమవారం 1,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మంగళవారం 11వేల క్యూసెక్కులకు పెరిగింది. 100 క్యూసెక్కుల నీటిని ప్రధానకాలువ ద్వారా వదులుతున్నారు. 10,900 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తోంది.





తాడ్వాయి శివారులో నీట మునిగిన మక్క పంట

కృష్ణాజీవాడిలో పార్శ్వనాథుని విగ్రహం లభ్యం



విగ్రహాన్ని పరిశీలిస్తున్న బృందం..



చెరువు కట్ట వద్ద లభించిన తలలేని వేణుగోపాలస్వామి విగ్రహం

ఎనిమిది వందల ఏళ్ల క్రితందని అంచనా

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడిలో ఎనిమిది వందల ఏళ్ల క్రితం నాటిదిగా భావిస్తున్న పార్శ్వనాథుని రాతి విగ్రహం లభ్యమైంది. తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు శ్రీకాంత్ మంచాల, కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వి.శంకర్ ఈ విగ్రహాన్ని గుర్తించారు. విగ్రహం ఛాతి భాగం మాత్రమే ఉండి, మిగిలిన భాగం విరిగిపోయి ఉంది. విగ్రహానికి తలవెనక భాగంలో ఏడు పడగల పాము, చెవులకు కుండలాలు ఉన్నాయి. ఈ విగ్రహం దాదాపు ఎనిమిది వందల ఏళ్ల క్రితం జైన మత ప్రాబల్యం అధికంగా ఉన్న కాలంలో చెక్కబడిందని భావిస్తున్నారు. తొలి కాకతీయుల కాలంలో ఈ ప్రాంతంలో జైనబసది ఉండే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ఈ విగ్రహం నూటాయాభై ఏళ్ల కన్నా ముందు నుంచే కృష్ణాజీవాడిలో ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇదే గ్రామంలో చెరువు కట్ట కింద కొన్ని శిల్పాలు ఉన్నాయి. అందులో కొంత భాగం విరిగిపోయిన వేణుగోపాల స్వామి పోలికలుగల విగ్రహం ఉన్నట్టు గుర్తించారు. వీటితో పాటు నాలుగు అడుగుల రాయిపై ద్వారపాలకుడి విగ్రహం, కొన్ని రాతి స్తంభాలు ఉన్నాయి. గ్రామంలో ఉన్న రాజరాజేశ్వర ఆలయ కోనేరు వద్ద ఉన్న లింగం, నంది విగ్రహాలను ఇక్కడి నుంచే ఆలయానికి తరలించారని, బహుశా ఈ జైన పార్శ్వనాథుడి విగ్రహం చెరువు కట్ట నుంచే ఇక్కడికి వచ్చి ఉంటుందని తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు శ్రీకాంత్ మంచాల తెలిపారు. కాగా పార్శ్వనాథుని విగ్రహానికి సంబంధించిన చరిత్రపై మరింత పరిశోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



పార్శ్వనాథుడి విగ్రహం

ఆసక్తికరంగా ఎన్నికల కేసు!

- ఎంపీ బీబీ పాటిల్ తన అఫిడవిట్‌లో కేసులు చూపలేదని ఆరోపణ
- హైకోర్టులో కేసు వేసిన కాంగ్రెస్ నేత మదన్‌మోహన్‌రావు
- రోజువారీ విచారణకు హైకోర్టు ఉత్తర్వులు
- సుప్రీం కోర్టులో ఎంపీ సవాల్‌కు తిరస్కారం



సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ తన ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు చేస్తున్న న్యాయపోరాటం ఆసక్తికరంగా మారింది. ఈ కేసులో రోజువారీ విచారణ జరగాలన్న హైకోర్టు ఉత్తర్వులను సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన ఎంపీకి నిరాశే ఎదురయ్యింది. ఆయన అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

న్యాయపోరాటం...

జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి 2019 ఏప్రిల్ 11న ఎన్నికలు జరిగాయి. మే 23న ఫలితాలు వచ్చాయి. టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు 4,34,244 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావుకు 4,28,015 ఓట్లు వచ్చాయి. 6,229 ఓట్ల తేడాతో పాటిల్ విజయం సాధించారు. గెలుపు వాకిట బోల్తాపడిన మదన్‌మోహన్‌రావు.. ఎంపీపై న్యాయపోరాటానికి సిద్ధపడ్డారు. బీబీ పాటిల్‌పై ఇతర రాష్ట్రాలలో కేసులు ఉన్నాయని, వాటిని అఫిడవిట్‌లో చూపకపోవడం నిబంధనలను ఉల్లంఘించడమేనంటూ ఆయన హైకోర్టులో కేసు వేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందున అనర్హత వేటు వేయాలని ఆయన న్యాయవాదులు వాదిస్తూ వస్తున్నారు. దీనిపై కోర్టులో విచారణ కొనసాగుతూ వచ్చింది. విచారణను వేగవంతం చేయాలన్న ఉద్దేశంతో రోజువారీ విచారణకు ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని ఎంపీ బీబీ పాటిల్ సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో స్టే విధించింది. ఈనెల 3న ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు.. సోమవారం తీర్పును వెలువరించింది. రోజువారీ విచారణను నిలిపివేయాలన్న బీబీ పాటిల్ అప్పీల్‌ను కొట్టివేసింది. దీంతో గతంలో హైకోర్టు ఇచ్చిన రోజువారీ విచారణకు లైన్ క్లియర్ అయినట్టేనని భావిస్తున్నారు. తాజాగా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావ్ ఎన్నికపై హైకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అనర్హత పిటిషన్‌పై ఆసక్తి నెలకొంది. సామాజిక మాధ్యమాల్లో దీనిపై చర్చ నడుస్తోంది.

న్యాయం జరుగుతుందంటున్న పిటిషనర్..

ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తన ఆస్తులు, అప్పులతో పాటు కేసుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాల్సి ఉంటుందని కాంగ్రెస్ నేత మదన్‌మోహన్‌రావు పేర్కొంటున్నారు. 2019 ఎన్నికలలో తనపై పోటీ చేసిన బీబీ పాటిల్ కేసుల విషయాన్ని గోప్యంగా ఉంచి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపిస్తున్నారు. కోర్టులో తనకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావంతో ఉన్నారు.

సీపీఎస్ రద్దయ్యే వరకు పోరు

- ఒకే సర్వీస్.. ఒకే పెన్షన్ విధానం అమలు చేయాలి
- సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్
- జిల్లాకు చేరిన ఓపీఎస్ సాధన సంకల్ప రథయాత్ర
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్: ఉద్యోగులకు తీవ్రంగా నష్టం చేస్తున్న సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటం ఆగదని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ స్పష్టం చేశారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఓపీఎస్ సాధన సంకల్ప రథయాత్ర మంగళవారం జిల్లాకు చేరుకుంది. ఈ యాత్రకు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం వద్ద జిల్లా ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కొత్త బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్‌రోడ్, సిరిసిల్లరోడ్‌ల మీదుగా రాజారెడ్డి గార్డెన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయం చేయడంతో విఫలమైందని ఆరోపించారు. సీపీఎస్ రద్దు రాష్ట్ర పరిధిలో ఉందన్నారు. రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలలో సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో వచ్చేనెల 12న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంట ఎల్లారెడ్డి, బాణాల భాస్కర్‌రెడ్డి, కోశాధికారి చింతల లింగం, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, టీటీయూ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

కళాశాలను పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి వైద్య కళాశాలకు సంబంధించి తరగతులను పాత కలెక్టరేట్ భవనంలో నిర్వహించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు విపుల్ మాట్లాడుతూ దేవునిపల్లిలో నిర్మించిన భవనాల్లో మెడికల్ కాలేజీ ఏర్పాటు వల్ల ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ వైద్య సేవలు ప్రజలకు అందకుండా పోతాయన్నారు. దీని కోసం పాత కలెక్టరేట్ భవనంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇరుకు భవనంతో చాలా విభాగాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ కారణంగా రోగులు, ప్రజలకు సరైన వైద్య సేవలు అందటం లేవన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సురేశ్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు వెంకటేష్, సంతోష్ రెడ్డి, వేణు, రాజగోపాల్ పాల్గొన్నారు.

'ఈవీఎంలపై అవగాహన కల్పించాలి'

కామారెడ్డి క్రైం: ఈవీఎంలపై కొత్త ఓటర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని సందర్శించారు. ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించడానికి ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఎన్నికల సూపరింటెండెంట్ సాయిభుజంగరావు, అధికారులు అనిల్ కుమార్, నరేందర్ తదితరులు ఉన్నారు.



ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

తెయూ అడిషనల్ కంట్రోలర్‌గా శాంతాబాయి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ విభాగానికి పి శాంతాబాయిని నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి మంగళవారం ఆమెకు ఉత్తర్వులను అందజేశారు. గతంలో ఆమె ఎస్సీ, ఎస్టీ సెల్ ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామర్‌గా, బాలికల వసతి గృహానికి వార్డెన్‌గా, ఇన్ఫ్రాస్ట్రక్చర్ సెల్‌కు డైరెక్టర్ గా, ఆర్ట్స్ కళాశాలకు వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు.

వాయిదా పడిన పీజీ పరీక్షల రీషెడ్యూల్ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన ఎంబీఏ, ఎంసీఏ సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్‌ను మంగళవారం కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ విడుదల చేశారు. ఎంబీఏ, ఎంసీఏ 2వ, 4వ సెమిస్టర్, ఐఎంబీఏ, అప్లయిడ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ (ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులు) 6వ, 7వ, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ఆగస్ట్ 2వరకు జరుగుతాయని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఏషియన్ గేమ్స్‌కు జిల్లావాసి మమత ఎంపిక

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన గూగులోత్ మమత ఏషియన్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీకి ఎంపికైంది. సెప్టెంబర్ 23నుంచి అక్టోబర్8 వరకు చైనాలో జరగనున్న ఏషియన్ గేమ్స్‌కు ఆమె ఎంపికైనట్లు సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ మంగళవారం తెలిపారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలేవి?



కామారెడ్డి టౌన్: జిల్లాలో నిబంధనలను పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాంతో వారు మాట్లాడారు. కొన్ని ప్రైవేట్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్నారని నోడల్ అధికారిని నిలదీశారు. ప్రైవేట్ కళాశాలలు జిల్లా అధికారి ఫొటోలతో ప్రచారం చేసుకుంటూ తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నారని ఇందుకు సహకరించవద్దని డిమాండ్ చేశారు. తక్షణమే విచారణ జరిపి కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. పుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలన్నారు. నేతలు భరత్, రాహుల్, రోషన్, శ్యాం సుందర్ తదితరులు ఉన్నారు.

రుద్రూర్‌లో దొంగల హల్‌చల్

- టమాటలు, కూల్‌డ్రింక్స్, సిగరెట్లు, నగదును ఎత్తుకెళ్లిన దుండగులు

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. బస్టాండ్ సమీపంలోని కూరగాయల దుకాణం, పాన్‌షాప్, టిఫిన్ సెంటర్ తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. కూరగాయల దుకాణంలో టమాటల బాక్సును, గల్లపెట్టెలో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం సమీపంలోని పాన్‌షాప్ తాళాలు పగలగొట్టి సిగరెట్లు, కూల్‌డ్రింక్స్ అపహరించారు. పక్కనే ఉన్న హోటల్‌లో చిల్లర నగదు ఎత్తుకెళ్లారు. శనివారం రాత్రి కూడా కూరగాయల షాపులో ఒక బాక్సు టమాటలు అపహరించారు. మంగళవారం ఉదయం చోరీని గమనించిన దుకాణ యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.



ఎల్లారెడ్డి శివారులో నీట మునిగిన వరి పంట



పొంగి ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు



ఉధృతంగా సర్వ వాగు

మళ్లీ దంచికొట్టిన వాన

- నీట మునిగిన పంట పొలాలు
- ధ్వంసమైన ప్రధాన రహదారులు
- పలు చోట్ల రాకపోకలకు అంతరాయం



గాంధారి: లోలెవల్ వంతెనపై నుంచి.. గుజ్జుల్ వాగు



తాడ్వాయి: సంతాయిపేట్‌లో భీమేశ్వర వాగు



ఉగ్రవాయి అంగన్‌వాడీ భవనంలో పెచ్చులూడిన పైకప్పు

జిల్లాను వరుణుడు వదలడం లేదు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మళ్లీ ముసురేసింది. సాయంత్రం నుంచి ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో పంట పొలాలు నీట మునిగాయి. ప్రధాన రహదారులు చాలా చోట్ల ధ్వంసమయ్యాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండి పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. – సాక్షి నెట్‌వర్క్



దోమకొండ కుడి చెరువును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ గ్రామానికి వెళ్లే రహదారి ఇలా..



మహమ్మద్‌నగర్ బస్టాండ్ వద్ద ఏర్పడ్డ గుంతలు



పిట్లం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో..



తాడ్వాయి: బ్రాహ్మణపల్లి శివారులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జ్ పక్కన..

నాలుగు నెలల్లో కాంగ్రెస్‌కు అధికారం



కామారెడ్డిలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: వచ్చే ఎన్నికల్లో నాలుగు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ జోస్యం చెప్పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ..పార్టీ కార్యకర్తలు అందరూ ఏకతాటిపై ఉండి సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని, రూ.4 వేల పింఛన్, రూ. 500 గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ అమలు చేస్తామన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాచారెడ్డి మండల అధ్యక్షులు గణేష్ నాయక్, నేతలు సందీప్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులపై నిర్లక్ష్యమేల?

మాచారెడ్డి: బంగారు తెలంగాణ అంటూ జీపీ కార్మికులపై ఇంత నిర్లక్ష్యం ఎందుకని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రశ్నించారు. మంగళవారం మాచారెడ్డిలో జీపీ, పారిశుధ్య కార్మికులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కరోనా సమయంలో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాని సమయంలో పారిశుధ్య కార్మికులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచారని కొనియాడారు. తెలంగాణ ధనిక రాష్ట్రమని అంటున్న ప్రభుత్వం మరి కార్మికుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సముచిత న్యాయం చేస్తామన్నారు.



లింగంపేటలో కూలిన రేకుల షెడ్డు



కొమలంచలో వర్షానికి కూలిన ఇల్లు



సంగోజివాడిలో ..

కూలిన ఇళ్లు..

నిజాంసాగర్/తాడ్వాయి/లింగంపేట/సదాశివనగర్/డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి పలువురి ఇళ్లు నేలకూలాయి. అలాగే కొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నిజాంసాగర్, తాడ్వాయి మండలాల్లో ఒక్కో ఇల్లు కూలిపోయాయి. సదాశివనగర్ మండలంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. లింగంపేట మండలంలో ఐదు ఇళ్లు కూలిపోయాయి. మండలంలోని నెహ్రూనగర్‌కు చెందిన చాకలి మహేష్‌కు చెందిన రేకుల షెడ్డు కూలిపోవడంతో అతని కుమారుడు భరత్‌కు గాయాలైనట్లు తెలిపారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో మూడు ఇళ్లు కూలిపోయాయి. కూలిన, దెబ్బతిన్న ఇళ్లను స్థానిక అధికారులు పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండవద్దని ప్రజలకు సూచించారు. ఇళ్లను కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

అభివృద్ధికి మారు పేరు కేసీఆర్

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

భిక్కనూరు: కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ మారు పేరుగా సీఎం కేసీఆర్ ఖ్యాతి పొందారని ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కొనియాడారు. మంగళవారం అయ్యవారిపల్లి గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నారన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసమే కొత్తగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా ఏర్పాటైన అయ్యవారి పల్లి గ్రామ పంచాయతీ భవనాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు నిధులను మంజూరు చేశామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఓట్లను దండుకోవడానికి ప్రజలకు మాయ మాటలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, సర్పంచ్ లక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన పోకల పెద్ద రాజుకు చెందిన పాడి గేదె మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు పశువైద్యాధికారి రవికుమార్, గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో గేదె మేతకు వెళ్లగా పంట చేనులోని బోరు మోటారు స్టాటర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గేదె విలువ రూ. 50వేలు ఉంటుందని, నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలో మంగళవారం ఉదయం అన్నారం రాజ గంగారాం అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుత్‌షాక్‌తో మరణించింది. వివరాలు ఇలా.. గేదె మేత మేయడానకి వెళ్లగా, సమీపంలోని కరెంటు స్తంభాన్ని తాకగా విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ఇద్దరికి తీవ్రగాయలు





తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు.. ప్రమాదానికి గురైన యాక్టివా బైక్

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట శివారులోని ఈద్గా వద్ద మంగళవారం హోండా యాక్టివా బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బోధన్ వైపు నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారు, నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వస్తున్న బైక్‌ను ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న బోధన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషయమంగా ఉంది. కారు, బైక్‌ను ఎడపల్లి ఠాణాకు తరలించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఇంకా ఫిర్యాదు అందలేదని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో ఇద్దరికి..

జక్రాన్‌పల్లి: మండలంలోని చాంద్‌మియాబాగ్ తండా వద్ద జాతీయ రహదారి44పై మంగళవారం రాత్రి మోటర్ సైకిల్‌ను, కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు రాములు వీడీసీ క్యాషియర్‌గా, బైరి మధు వీడీసీ సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం రాత్రి పని నిమిత్తం ఇరువురు బైక్‌పై చాంద్‌మియాబాగ్‌కు వెళ్లారు. పని ముగించుకొని తిరిగి కేశ్‌పల్లికి బయలుదేరారు. ఈక్రమంలో హైవేపై యూటర్న్ వద్ద వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో రాములు, మధులకు తీవ్ర గాయాలయ్యాయి.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో పలువురు మృతిచెందారు. మోర్తాడ్ మండలంలో ఓ వ్యక్తి పంట కాలువలో పడి మృతిచెందగా, కోటగిరి మండలంలో మతిస్థిమితం లేని వ్యక్తి వాగు గుంతలో పడి మృత్యువాతచెందాడు. అలాగే క్యాసంపల్లి సమీపంలో ఓ రైతు బైక్ అదుపుతప్పి మృతిచెందాడు. ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించాడు.

మోర్తాడ్: మండలంలోని సుంకెట్‌లో గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మయ్య(69) అనే వ్యక్తి సోమవారం పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాలేడు. అతని కోసం కుమారుడు గడ్డం ఉదయ్‌కుమార్, కుటుంబ సభ్యులు అనేక చోట్ల గాలించారు. మంగళవారం పంట కాలువలో లక్ష్మయ్య మృతదేహం లభించింది. రాత్రి కాలువలో పడిపోవడంతో మరణించి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించామన్నారు.

కోటగిరిలో ఒకరు..

రుద్రూర్: కోటగిరి మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోగల వాగు గుంతలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కల్లూర్ గ్రామానికి చెందిన గంగారాం (40)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈక్రమంలో గంగారాం సోమవారం ఇంట్లోంచి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతుకుతుండగా గ్రామ శివారులోని వాగు గుంతలో మృతదేహమై కన్పించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎరువుల కోసం వచ్చి వెళ్తుండగా రైతు..



కామారెడ్డి క్రైం: ఎరువులు కొందామని జిల్లా కేంద్రానికి వచ్చిన ఓ రైతు తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన కరికె స్వామి (38) వ్యవసాయం చేసేవాడు. తన పంట పొలానికి అవ సరమైన ఎరువుల కోసం మంగళవారం మధ్యాహ్నం కామారెడ్డికి వచ్చాడు. సాయంత్రం ఇంటికి బైక్‌పై వెళ్తుండగా క్యాసంపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..



మల్లయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చిన్నమెడికుంది మల్లయ్య(41)కు భార్య గౌరవ్వతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా రెండేళ్ల క్రితం ఆయన తన పొలంలో బోరు వేయడంతోపాటు ఇల్లు కట్టాడు. మరుసటి యేడు పెద్ద కూతురు పెళ్లి చేశాడు. దీంతో అతనికి సుమారు రూ.12లక్షల అప్పులయ్యాయి. అప్పుల బాధ భరించలేక మల్లయ్య ఈ నెల 18న రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. మరుసటిరోజు వేకువజామునే ఈ విషయాన్ని అతడు హైదరాబాద్‌లో ఉంటున్న తన భార్య, కూతురు వద్దకు వెళ్లి చెప్పాడు. దీంతో అతడిని కుటుంబసభ్యులు సమీపంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఈ నెల 20న గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా సోమవారం రాత్రి మల్లయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్న కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఉమేష్ తెలిపారు.

ఫ్యాక్టరీ వర్కర్‌పై దాడి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి ఆర్మూర్‌రోడ్డు సుఖ్‌జిత్ స్టార్చ్‌మిల్ వర్క్‌షాప్‌లో పనిచేసే సోమ్‌సుందర్ అనే వర్కర్‌పై మంగళవారం ఓ వ్యక్తి దాడి చేసి, తీవ్రంగా గాయపర్చాడు. తూమ్ రాజు అనే వ్యక్తి ముబారక్‌నగర్‌లో సోమ్‌సుందర్‌పై గొడ్డలి కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి, అతడి బైక్‌ను ఎత్తుకుపోయాడు. బైక్‌లో డబ్బులు ఉన్నాయని బాధితుడు తెలిపాడు. బాధితుడిని తోటి కార్మికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.